డిప్యూటీ మేయర్ల ఎంపికపైనే దృష్టి

- కూటమి నేతలకు కట్టబెట్టే యత్నం
- ఏలూరు కార్పొరేషన్‌లో రెండు పదవులు
- 3న పరోక్ష పద్ధతిలో ఎంపిక

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర వ్యాప్తంగా పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఖాళీగా ఉన్న చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, డిప్యూటీ మేయర్‌ల ఎంపిక కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఫిబ్రవరి 3న పరోక్ష పద్ధతిలో ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని ఇప్పటికే కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఏలూరు కార్పొరేషన్ పరిధిలో ఖాళీగా ఉన్న రెండు డిప్యూటీ మేయర్ పదవులకు ఎన్నిక నిర్వహించనున్నారు. పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల పదవీ కాలం ఇంకా ఏడాదిన్నర మాత్రమే ఉంది. ఈ ఖాళీల్లో తమ కేడర్‌ను భర్తీ చేసేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తుంది.

పదవుల కోసం పోటీ

వైఎస్సార్ సీపీ హయాంలో ఏలూరు నగరపాలక సంస్థలో ఇద్దరు డిప్యూటీ మేయర్‌లుగా పనిచేసేవారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన గుడిదేశి శ్రీనివాసరావు, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నూకపెయ్యి సుధీర్ బాబు డిప్యూటీ మేయర్లుగా పనిచేశారు. ఎన్నికల అనంతరం ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయం సాధించడం, తాము ఇక ఆ పదవుల్లో కొనసాగలేమనే ఉద్దేశంతో శ్రీనివాసరావు, సుధీర్ బాబులు రాజీనామా చేశారు. నాటి నుంచి నగరపాలక సంస్థలో డిప్యూటీ మేయర్ పదవులు ఖాళీగానే ఉన్నాయి. ఆ పదవుల కోసం టీడీపీకి చెందిన కార్పొరేటర్లతో పాటు, వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలోకి జంప్ చేసిన కార్పొరేటర్లు పలువురు పోటీ పడుతూ వచ్చారు.




వందనాల దుర్గాభవాని


పప్పు ఉమామహేశ్వరరావు


కర్రి శ్రీనివాసరావు

అంతా ఎమ్మెల్యే కనుసన్నల్లోనే..

డిప్యూటీ మేయర్ల పదవుల ఎంపిక వ్యవహారం అంతా స్థానిక ఎమ్మెల్యే బడేటి చంటి కనుసన్నలోనే సాగనుంది. ఇప్పటికే ఈ పదవులకు సంబంధించి ఎమ్మెల్యే ఒక క్లారిటీ ఇచ్చినట్టు తెలిసింది. వైఎస్సార్ సీపీ హయాంలోనూ టీడీపీ తరుపున కార్పొరేటర్‌గా పోటీచేసి గెలుపొందిన వారిలో ఒకరికి, వైఎస్సార్ సీపీలో గెలిచి తర్వాత టీడీపీ తీర్థం పుచ్చుకున్న కార్పొరేటర్ల నుంచి ఒకరికి డిప్యూటీ మేయర్ పదవులు కేటాయించాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నిర్ణయించిందని చెబుతున్నారు. ఈ క్రమంలోనే స్థానిక 47వ డివిజన్‌కు టీడీపీ నుంచి గెలిచిన వందనపు దుర్గాభవానీకి మొదటి ప్రాధాన్యతగానే డిప్యూటీ మేయర్ పదవిని కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైంది. రెండో డిప్యూటీ మేయర్ పదవి వైఎస్సార్ సీపీ నుంచి గెలిచి టీడీపీ తీర్థం పుచ్చుకున్న పప్పు ఉమామహేశ్వరరావు (30 విడిజన్ కార్పొరేటర్), కర్రి శ్రీనివాసరావు (12వ డివిజన్ కార్పొరేటర్)లలో ఒకరికి చాన్స్ దక్కే అవకాశం ఉందని చెబుతున్నారు.

చెరో సగం రోజుల పదవి?

మరో వైపు వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరిన పప్పు ఉమామహేశ్వరరావు, కర్రి శ్రీనివాసరావులు ఇద్దరికీ డిప్యూటీ మేయర్ పదవికట్టబెట్టే ప్రయత్నంగా మధ్యేమార్గంగా ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఉన్న 18 నెలల కాల పరిమితిని చెరో సగం రోజులు డిప్యూటీ మేయర్‌గా పనిచేసే అవకాశం కల్పించనున్నట్టు తెలిసింది. మొదటి ప్రాధాన్యతగా ఉమామహేశ్వరరావుకు, రెండో ప్రాధాన్యతగా శ్రీనివాసరావులకు చెరో సగం రోజులు పదవి కట్టబెట్టే దిశగా ఎమ్మెల్యే చంటి చర్యలు చేపట్టే అవకాశం ఉందంటున్నారు. మరి కొద్ది రోజుల్లో డిప్యూటీ మేయర్ పదవుల భర్తీ పూర్తి కానుండటంతో ఈ పదవి కోసం ఆశించిన వారిలో ఉత్కంఠత నెలకొంది. మరెవరిదైనా కొత్త పేరు తెరపైకి వచ్చినా ఆశ్చర్య పోనక్కరలేదనే ప్రచారమూ ఉన్నాయి.

క్లుప్తంగా

ఈవీఎం గోదాము తనిఖీ


ఈవీఎం గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో) : స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోదామును కలెక్టర్ కె.వెట్రిసెల్వి తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలో భాగంగా బుధవారం కలెక్టర్ ఈవీఎం గోదామును సందర్శించి షర్టర్లకు ఉన్న సీళ్లు, ఫైర్‌ఎక్స్ టింగ్విషర్లు, సీసీ కెమేరాల పనితీరును పరిశీలించారు. ఈవీఎంల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్లపై ఆరా తీశారు. ఇక్కడున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఆర్‌ఓ వి.విశ్వేశ్వరరావు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

మంచినీటిని జాగ్రత్తగా వాడుకోవాలి

ఏలూరు (టూటౌన్): రానున్న వేసవి తీవ్రతను దృష్ట్యా మంచినీటిని జాగ్రత్తగా వాడుకోవాలని నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్‌ఎంఆర్ పెదబాబు ప్రజలకు సూచించారు. ఆయన బుధవారం ఉదయం మున్సిపల్, అధికారులు కార్పొరేటర్ల బృందంతో కలిసి దెందులూరులో ఉన్న గోదావరి జలాల సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలించారు. అక్కడ సుమారు 40 రోజుల వరకు సరిపడా గోదావరి జలాలు ట్యాంకులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంఈలు, డీఈలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

దత్తత ఉత్తర్వులు అందజేత


తల్లిదండ్రులకు దత్తత ఉత్తర్వులు అందిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): స్థానిక బాలసదనంలోని నూకాలమ్మ అలియాస్ మహతి సౌమ్య (12) పాపతో అనుబంధాన్ని పెంచుకున్న తర్వాత తమిళనాడుకు చెందిన సేలం జిల్లా వాస్తవ్యులైన జనార్ధనన్.కె, సీతాలక్ష్మి ఎం దంపతులకు తుది దత్తత ఉత్తర్వులను కలెక్టర్ వెట్రిసెల్వి బుధవారం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో అందజేశారు. ఐదారు ఏళ్లు పైబడిన బాలలను దత్తత తీసుకోవడం శుభపరిణామమని ఆమె అన్నారు. దత్తత తీసుకున్న పిల్లలకు మంచి విద్యాబుద్ధులు నేర్పించి, వారు ఉన్నత శిఖరాలు అధిరోహించే విధంగా తల్లిదండ్రులు కృషి చేయాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి శారద, జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సీహెచ్ సూర్య చక్రవేణి, శిశు గృహ మేనేజర్ కె.భార్గవి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక విద్యా శిక్షణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సీఆర్‌ఆర్ అటానమస్ కళాశాలలో ఈ నెల 28, 29 తేదీల్లో కెరీర్ గైడెన్స్ - ప్లేస్మెంట్ సెల్, వాణిజ్య శాస్త్ర విభాగం, అర్థశాస్త్ర విభాగం, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో బీకాం, బీఏ తృతీయ సంవత్సర విద్యార్థులకు 10 గంటల ఆర్థిక విద్యా అంశంపై కోన - కోన శిక్ష అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ కేఏ రామరాజు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు సెక్యూరిటీ, లిక్విడిటీ గూర్చి తెలుస్తుందన్నారు. కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు తమ బ్యాంకు ఖాతా నిర్వహణలు, ఆయా డిపాజిట్ల ఉపయోగాలు తెలుస్తాయని చెప్పారు. ప్రధాన వక్త ఎన్‌ఐఎస్‌ఎం ట్రైనర్ సీహెచ్ విజయ్ కుమార్ (విజయవాడ) మాట్లాడుతూ బ్యాంకు డిపాజిట్లులో సెక్యూరిటీ నిర్వహణ, లిక్విడిటీ నిర్వాహణ, వివిధ రకాల ఖాతాల నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.విశ్వేశ్వరరావు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ జి.రాము, కెరీర్ గైడెన్స్ - ప్లేస్మెంట్ సెల్ కో ఆర్డినేటర్, వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి బీఆర్‌డీ ఫణికుమార్, అర్థశాస్త్ర విభాగాధిపతి ఆర్ కేశవ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అపుస్మా క్రీడా పోటీలు


ఖోఖో క్రీడలో జూనియర్స్‌లో ప్రథమ స్థానం సాధించిన ఏలూరు జోన్ జట్టు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) ఏలూరు జిల్లా ఇంటర్ జోనల్ బాయ్స్ క్రీడా పోటీలు స్థానిక ఏఎస్‌ఆర్ స్టేడియంలో రెండో రోజు బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ పోటీల్లో వాలీబాల్‌లో ఉంగుటూరు జోన్, చింతలపూడి జోన్‌లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. కబడ్డీ సీనియర్స్‌లో చింతలపూడి జోన్, ఏలూరు జోన్‌లు, జూనియర్స్ కబడ్డీలో ఏలూరు జోన్, చింతలపూడి జోన్‌లు, ఖోఖో జూనియర్స్‌లో ఏలూరు జోన్, చింతలపూడి జోన్‌లు వరుస స్థానాలను కైవశం చేసుకున్నాయి. షటిల్ బ్యాడ్మింటన్ సీనియర్స్‌లో ఏలూరు న్యూ జనరేషన్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా గేమ్స్ కన్వీనర్ జేఎం జెవియార్, అపుస్మా జిల్లా అధ్యక్షుడు ఎం శివకుమార్ శర్మ, సెక్రటరీ ఎన్‌ఆర్‌కేఏ ప్రసాద్ మాట్లాడుతూ అన్ని కేటగిరిల్లోనూ పోటీలు నిర్వహించగా, వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన విద్యార్థులు పాల్గొని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారని తెలిపారు. గురువారం బాలికలకు సంబంధించి వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం నుంచి విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామని చెప్పారు.

ఫిబ్రవరి 15న సెలవు ప్రకటించాలి

ఏలూరు (టూటౌన్) : ప్రపంచ వ్యాప్తంగా 15 కోట్ల మంది లంబాడీల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ఫిబ్రవరి 15న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని ఎస్టీ బంజారా సుగాలి లంబాడి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గుగ్గులోతు కృష్ణ నాయక్, ధారావతు రాజబాబు నాయక్‌లు బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా ప్రతి జిల్లాలో నిర్వహించాలని, రూ.10 లక్షలు చొప్పున నిధులు తెలంగాణ ప్రభుత్వం తరహాలో మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఎస్టీ బంజారా సుగాలి లంబాడీ సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం సాయంత్రం 4 గంటలకు చింతలపూడిలో నిర్వహిస్తామని, లంబాడీ తండాల్లోని సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూక్యా నాగేశ్వరావు నాయక్, ధారావత్ కీమా నాయకులు పాల్గొంటారని వివరించారు.

తంగెళ్లమూడిలో కుటుంబం అదృశ్యం

ఏలూరు టౌన్: అప్పుల బాధలో లేక ఇతర కారణాలతోనో ఒక కుటుంబం అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఏలూరులోని తంగోళ్లమూడి ప్రాంతంలోని లక్ష్మీ మెడికల్ పేరుతో పి.వీర వెంకట సత్య వరప్రసాద్ అనే వ్యక్తి మెడికల్ షాపును నిర్వహిస్తున్నాడు. అతనికి ఏలూరు రాణీ నగర్ ప్రాంతానికి చెందిన వెంకట పార్వతితో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక బాబు ఉన్నాడు. ఈనెల 25 వివాహ వేడుకకు వెళ్లి వస్తామని వెంకట పార్వతి ఆమె తండ్రికి చెప్పడంతో కుటుంబంతో వెళ్లారు. ఇప్పటివరకు ఇంటికి తిరిగి రాలేదని రంగారావు తన కుమార్తె, అల్లుడు, మనవడు కనబడడం లేదని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై నాగ కళ్యాణి కేసు దర్యాప్తు చేస్తున్నారు. తన అల్లుడు ఆర్థిక కారణాల వల్ల ఇంట్లోంచి బయటికి వెళ్లిపోయి ఉంటాడని ఫిర్యాదు పేర్కొన్నారు.

నిరుద్యోగులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం

దెందులూరు: కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలను పట్టిచుకోవడం లేదని, 20 లక్షల ఉద్యోగాలు, నెలకు ఒక్కొక్కరికీ రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారని ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్ ప్రశ్నించారు. బుధవారం దెందులూరులో ఆయన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు తలారి రామకృష్ణ కలిసి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏర్పడి ఏడు నెలలు కావస్తున్నా ఏ ఒక్క హామీ అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగాలు నోటిఫికేషన్ కోసం లక్షలాది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారని అన్నారు. జాబ్ క్యాలెండర్ ఊసేలేదని వారన్నారు. సంక్షేమ పథకాలకు నిధులు ఇవ్వలేమని సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం రాష్ట్ర ప్రజలందరినీ మోసం చేయడమేనన్నారు.

5న కార్మిక సంఘాల నిరసన


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

ఏలూరు (టూటౌన్): కేంద్ర ప్రభుత్వం 2025 - 26 వార్షిక బడ్జెట్లో ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు నిధులు ఎక్కువగా కేటాయించాలని, విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే ప్రతిపాదనలు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 5న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన నిరసన కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ ఉద్యోగ, కార్మిక సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. స్థానిక స్ఫూర్తి భవనంలో ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. వివిధ సంస్థలు, పరిశ్రమలు, ఆసుపత్రులు, ప్రైవేటు వ్యాపార సంస్థలలో పనిచేసే లక్షలాదిమంది ఉద్యోగ, సిబ్బందికి ఉపయోగపడే మినిమం వేజ్ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఏర్పాటు చేయాలని సమావేశంలో తీర్మానించారు. ఏలూరు జిల్లా కేంద్రంలో రెండు జూట్ మిల్లులు మూతపడటంతో వేలాదిమంది ఉపాధి కోల్పోయారని, జిల్లా కేంద్రంలో పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేయాలని తీర్మానించారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని వెంకట రామారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు మాట్లాడారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు,నగర అధ్యక్షులు కే కృష్ణమాచార్యులు,నాయకులు తొర్లపాటి బాబు ,పుప్పాల కన్నబాబు, భజంత్రీ శ్రీనివాసరావు, గంధం అంజమ్మ,కారం దారయ్య,కుంచే వసంతరావు,బళ్ల కనకదుర్గారావు తదితరులు మాట్లాడారు.

లేబర్ కోడులను రద్దు చేయాలి


విప్లవ గీతాలు ఆలపిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): కార్పొరేట్లకు అనుకూలంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను, మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. నెల్లిమర్ల జూట్ కార్మికుల అమర వీరుల సంస్మరణ సభ ఐఎఫ్‌టీయూ ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి, ఏలూరు మార్కెట్ యార్డ్ హమాలి వర్కర్స్ యూనియన్ సెక్రెటరీ యర్రా శ్రీనివాస్‌రావు అధ్యక్షతన బుధవారం స్థానిక వీవీ నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు, మార్కెట్ యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డి అప్పలనాయుడు, ఐఎఫ్‌టీయూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడారు. నెల్లిమర్ల జూట్ కార్మికులు హక్కుల రక్షణ కోసం ప్రాణత్యాగాలు చేసిన చరిత్రను గుర్తు చేశారు. అమరులైన కార్మికులకు సంతాప సూచికగా మౌనం పాటించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ పరిధిలో వివిధ సబ్‌స్టేషన్లల్లో కండక్టర్ల మార్పు, వార్షిక మరమ్మతుల నిమిత్తం ఈ నెల 31న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. భీమడోలు సబ్ స్టేషన్ పరిధిలోని భీమడోలు, ద్వారకా తిరుమల, ఉంగుటూరు, పెదవేగి, దెందులూరు, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాల్లో వ్యవసాయ, తాగునీటి సర్వీసులకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారు జామున 5 గంటల ఉంటుందని పేర్కొన్నారు. వేగివాడ సబ్‌స్టేషన్ పరిధిలో వేగివాడ, చక్రాయిగూడెం, కె.కన్నాపురం, చల్లచింతలపూడి గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. పెదవేగి మండలం కవ్వగుంట, పెదవేగి, సూర్యారావుపేట, లక్ష్మీపురం, ఎంఆర్‌సీ కాలనీ, గార్లమడుగు, వెంకటకృష్ణాపురం, జగన్నాథపురం, వంగూరు, లక్ష్మీపురం , కూచిపూడి, న్యాయంపల్లి, రామశింగవరం గ్రామాలకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. ఏలూరు డీ-4 సెక్షన్ పరిధిలో ఆటో నగర్, కొమడవోలు, తూర్పులాకులు, సాయినగర్‌లలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని తెలిపారు.

వరిలో ఎరువుల యజమాన్యం కీలకం

దెందులూరు : వరిలో ఎరువుల యాజమాన్యం అత్యంత కీలకమని, చీడపీడలు యాజమాన్యం నివారణ మందులు వాడకం వ్యవసాయ శాఖ సూచనలు సలహాలు రైతులు విధిగా పాటించాలని డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు డాక్టర్ ఫణికుమార్ నాగేంద్ర బాబు అన్నారు. బుధవారం పోతునూరులో దెందులూరు మండల వ్యవసాయ శాఖ అధికారి దామా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారి దామా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ నాయకులు బొడ్డేటి మోహన్, నున్న లక్ష్మణ లంక అప్పారావు రైతులు వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి

పోలవరం రూరల్ : పట్టిసం మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లకు ప్రత్యేక నిధులు మంజూరు చేయించాలని గ్రామస్తులు ఆర్డీఓ, ఉత్సవ కమిటీ చైర్మన్ ఎంవీ రమణకు విజ్ఞప్తి చేశారు. శివక్షేత్రం వద్ద ఇసుక తిన్నెలపై మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు లక్ష మందికి పైగా భక్తులు వీరేశ్వరస్వామిని దర్శించుకుంటారు. ఉత్సవాల ఏర్పాట్లలో పట్టిసం పంచాయతీ, దేవస్థానం అధికారులు చేపడుతారు. నిధుల కొరతతో పంచాయతీ గత నాలుగేళ్లుగా ఉత్సవాల సమయంలో చేసిన ఏర్పాట్లకు సంబంధించి టెండర్లదారులకు సుమారు రూ.20 లక్షల బకాయిలు పడింది. ఈ ఏడాది చలువ పందిళ్లు, విద్యుత్ అలంకరణ, తాత్కాలిక మరుగుదొడ్లు, చేతిపంపులు తదితర ఏర్పాట్లు చేపట్టేందుకు టెండర్లు పిలిచినప్పటికీ పాత బకాయిలు ఉండిపోవడంతో ఈ ఏడాది పనులు చేసేందుకు టెండర్‌దారులు ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది. పంచాయతీకి వచ్చే ఆదాయం తక్కువ, ఖర్చు ఎక్కువ కావడంతో ఉత్సవాల బకాయిలు ఉన్నాయని కార్యదర్శి తెలిపారు. దేవస్థానం అధికారులు శివక్షేత్రం ప్రాంతం మాత్రమే ఏర్పాట్లు చేస్తున్నారు. క్షేత్రం దిగువన ఇసుక తిన్నెలపై భక్తుల సౌకర్యార్థం చేసే ఏర్పాట్లలో చలువ పందిళ్లు మరికొన్ని పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది పంచాయతీకి ఆదాయం లేకపోవడం వల్ల రూ.10 టిక్కెట్ పెంచుతున్నట్లు కార్యదర్శి తెలిపారు. కాలినడకన భక్తులపై భారం మోపడంపై సమంజసం కాదని గ్రామస్తులు తెలిపారు. సమస్య కలెక్టర్ వెట్రిసెల్వి దృష్టికి తీసుకెళతానని ఆమె ఆదేశాలతో ఏర్పాట్లు చేయాలని అధికారులు సూచించారు.

పాఠశాల స్థలం ఆక్రమణ తొలగింపు

దెందులూరు: చల్లచింతలపూడి పంచాయతీ తిమ్మన్నగూడెం గ్రామం ప్రాథమిక పాఠశాల స్థలాన్ని ఆక్రమించారని ఆరోపిస్తూ గ్రామస్తులు కలెక్టర్ వెట్రిసెల్వికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. డీఈవో, ఎంఈవోలు సంఘటన స్థలానికి వెళ్లి విచారణ నిర్వహించి నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశించారని దెందులూరు మండల విద్యాశాఖ అధికారిని కే. అన్నమ్మ తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం పాఠశాలకు వెళ్లి పరిశీలించినట్టు ఎంఈవో తెలిపారు. స్కూల్ కమిటీ సభ్యులతో మాట్లాడి ఆక్రమణ తొలగించామని ఎంఈఓ తెలిపారు.

నేటి నుంచి హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీ


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ లావణ్య, ఏఓ కరుణానిధి

దెందులూరు: వేగవరం హేలాపురి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ కాలేజీ ఆవరణలో గురు, శుక్రవారాల్లో జేఎన్‌టీయూ కాకినాడ ఆధ్వర్యంలో అంతర్ కళాశాలల హ్యాండ్‌బాల్ బాలబాలికల విభాగాల్లో టోర్నమెంట్ ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని ప్రిన్సిపాల్ ఎం లావణ్య, కళాశాల ఈవో కరుణానిధి అన్నారు. బుధవారం కళాశాలలో వారు మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, తూర్పుగోదావరి జిల్లాలో కళాశాల నుంచి బాలుర విభాగానికి 25 జట్లు, బాలికల విభాగానికి 11 జట్లు ఎంపిక చేస్తామన్నారు. జట్ల కోచ్‌లు, ఫిజికల్ డైరెక్టర్లు, అబ్జర్వర్లతో కలిసి పోటీలు నిర్వహించే క్రీడా ప్రాంగణాన్ని ప్రిన్సిపల్, ఏవో బుధవారం పరిశీలించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	27
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	31
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	15
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	15
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	20
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	26
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	24
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	26
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు - తిరుపతి	16.00	4830	22
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	44
వంకాయలు (కాంతులు)	24	బీక్షచిక్కుడు	70
వంకాయలు (తెలుపు)	20	చామదుంపలు	44
బెండకాయలు	36	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	28	కంద	68
కాకర కాయలు	38	బీట్‌రూట్	36
బీరకాయలు	48	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	52	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	20	అల్లం	60
క్యారెట్	36	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	36	పాలకూర	10
బంగాళదుంపలు	30	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	30	గోంగూర	07-10
దోసకాయలు	28	పుదీనా	05
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	64
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	44